రానున్న మూడు రోజులు భారీ వర్షాలు

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఆర్‌డిఒలు, తహశీల్దార్‌లు, ఇతర అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. అన్ని మండల కేంద్రాలలో, ఆర్‌డిఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు 24/7 పనిచేయాలని సూచించారు. అలాగే క్షేత్ర స్థాయి సిబ్బంది నిత్యం పర్యటిస్తూ ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరద ముంచెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల నోడల్ అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఏదైనా సంఘటన జరిగితే వెంటనే తనకు సమాచారం అందించాలని సూచించారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది

- కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్
- ఘనంగా గురుపూజోత్సవం
- 75 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో కలెక్టర్ అంబేద్కర్, డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కొనియాడారు. ఉత్తమ పౌరులను తయారు చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. గురుపూజోత్సవ వేడుకలు కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 75 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. వారికి దుశ్శాలువ, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. ఒక ఉపాధ్యాయుడు విధి నిర్వహణలో పొరపాటు చేస్తే దాని ప్రభావం మొత్తం సమాజంపై ఉంటుందన్నారు. అందువల్ల ఉపాధ్యాయులపై సామాజిక బాధ్యత ఎంతో ఉందని అన్నారు. ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే నేడు సమాజంలో ఎంతోమంది ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని కలెక్టర్ చెప్పారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ ఉత్తమ ప్రవర్తనతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. సత్యం, ఉత్తమ ప్రవర్తన, ఆదర్శనీయమైన నడత ఉపాధ్యా యులు అలవాటు చేసుకోవాలని సూచించారు. మంచి సమాజాన్ని, గొప్ప భారత దేశాన్ని నిర్మించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ, విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయుల మార్గదర్శకులని కొనియాడారు. విద్యార్థులను మంచి దారిలో నడిపించే బాధ్యత వారి చేతిలోనే ఉందని స్పష్టం చేశారు. నేటి సమాజ పోకడలను దృష్టిలో పెట్టుకొని, ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. విజయనగరంలో మహారాజా కళాశాలతోపాటు, సంగీత, సంస్కృత కళాశాలలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ కుమార్, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.బాలాజీ మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి రామవరం జెడ్‌పి స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాసరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

వర్షాలు కురిసినా ఖరీఫ్ పంటల సాగు అత్తెసరుగానే కనిపిస్తోంది. ఇప్పటికీ 75శాతానికి మించి సాగు విస్తీర్ణం లేకపోవడమే ఇందుకు తార్కాణం. వరినాట్లు ఎట్టకేలకు 82శాతానికి చేరాయి. జిల్లాలో తగినన్ని సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతోపాటు ఉన్న కొద్దిపాటి జలాశయాల పనులు పూర్తిచేయకపోవడం, కాలువలు ఆధునీకరించకపోవడం ఇందుకు కారణంగా చెప్పుకోవచ్చు.

వర్షాలు కురిసినా..

అంతంత సాగే

- నేటికీ 75శాతం మించని ఖరీఫ్
- ఎట్టకేలకు 82 శాతానికి చేరిన ఉబాలు
- సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే కారణం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది ఖరీఫ్ పంటలన్నింటి సాగు విస్తీర్ణం 2,95,897 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు కేవలం 2,22,055 ఎకరాల్లో మాత్రమే పంటల సాగు కనిపిస్తోంది. ఇది 75శాతంగా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే ఒక్కశాతం పెరిగినప్పటికీ నాటికీ నేటికీ వర్షపాతం నమోదులో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. దీన్నిబట్టి వర్షాలు కురిసినప్పటికీ నిల్వచేసుకునేందుకు అనుగుణంగా ప్రాజెక్టులు లేకపోవడంతో ఆ నీరంతా సముద్రంలో కలిసిపోతోంది. ఈ ప్రభావం జిల్లాలో ప్రధాన పంటగా భావిస్తున్న వరి నాట్లపైనా పడింది. ఇప్పటి వరకు 82శాతం విస్తీర్ణంలోనే నాట్లుపడ్డాయి. 2,22,538 ఎకరాల్లో నాట్లు పడాల్సివుండగా 1,80,082 ఎకరాల్లో మాత్రమే సాగు నమోదైంది. వరి తరువాత అంతటి ప్రధాన పంటగా భావిస్తున్న మొక్కజొన్న సాగు కూడా 65శాతానికే పరిమితమైంది.

నువ్వుల సాగు 60శాతం, పత్తి 51శాతం, చెరకు సాగు 45శాతం విస్తీర్ణంలో పడింది. ఇందుకు ప్రధాన కారణం పంటలన్నీ వర్షాధారం కావడం వల్ల రైతులు సాగు విషయంలో సాహించలేకపోతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వర్షపాతాన్ని ఒక్కసారి పరిశీలిస్తే.... జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 497.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సివుండగా, 642 మి.మీ మేర కురిసింది. ఆగస్టులో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ సాధారణ వర్షపాతమే నమోదైంది. ఇక జూన్, జులై, సెప్టెంబర్‌లో అధిక వర్షపాతం నమోదైంది. అయినప్పటికీ పంటల సాగు పరిమితంగా ఉండడం ఆందోళనకరంగా కనిపిస్తోంది. గత రెండు దశాబ్దాలుగా సాగునీటి రంగంపై పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. నీటి తీరువా వసూళ్లు, నీటి సంఘాల ఎన్నికలపై చూపిన శ్రద్ధ చెరువుల్లోని మదుములు, సాగునీటి కాలువల నిర్వహణపై చూపలేదు. దీంతో, ఈ ఏడాది ఇంత ఎక్కువ వర్షాలు కురినప్పటికీ నిన్నమొన్నటి అధిక వర్షాల వరకు చెరువులు నిండని పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు నెల్లిమర్ల, గుర్ల, భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు 24వేల ఎకరాల సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన రామతీర్థసాగర్ ప్రాజెక్టు పూర్తికాలేదు. దీంతో, ఈ మండలాల్లో ఏటా పంటల సాగు తగ్గిపోతోంది. గుర్ల గెడ్డ నిర్మాణ పనుల్లోనూ పురోగతి లేదు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరింత ఎక్కువగా తగ్గింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు పూర్తయిపోయినట్టు చెప్పుకుంటున్న తోటపల్లి బ్యారేజీ నీరు కూడా లక్ష్యానికి అనుగుణంగా అందడం లేదు. కుడికాలువ ద్వారా 1.20లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సివుండగా 80ఎకరాలకు సాగునీరు అందడం లేదు. ఈ నేపథ్యంలో చివరి ఆయుకట్టుదారులు నిరాశతో ఉన్నారు. ఇక ఆంధ్ర, తాటిపూడి తదితర జలాశయాల పరిధిలోనూ ఇంకా ఉబాలు పూర్తికాలేదు. ఇప్పటికైనా పాలకులు సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్వహణపై దృష్టిసారించాల్సి వుంది.

బొబ్బిలిలో చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలోని బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి పోలీస్‌స్టేషన్లను ఎస్‌పి ఆకస్మికంగా సందర్శించారు. స్టేషను ప్రాంగణాన్ని, గదులను, ప్రాపర్టీ రూం, లాకప్ గదులను పరిశీలించారు. సీజ్ చేసిన వివిధ వాహనాలను పరిశీలించారు. అనంతరం స్టేషనులో క్రైమ్ చార్ట్ పరిశీలించి, స్టేషను పరిధిలో రహదారి ప్రమాదాలు ఎక్కడ ఎక్కువ జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాలు అమలు చేయాలని సూచించారు. ప్రజలకు రహదారి భద్రత పట్ల, కొత్త చట్టాలు, మహిళల భద్రత పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించారు. నేరాల నియంత్రకు గస్తీ, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. గంజాయి నియంత్రణకు జిల్లాలో ఐదు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం బ్లాక్‌స్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐలు నారాయణ రావు, సతీష్‌కుమార్, విజయనాథ్, ఎస్ఐలు ప్రసాద్, తారకేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గోస్తనీ ఉప్పొంగితే... ఊరికి వణుకే

- కొండను తినేసిన మైనింగ్ మాఫియా
- ప్రవాహం దిశ మారితే ప్రమాదం
- వరదల భయంపై జామి ప్రజల ఆందోళన

గోస్తనీ నదీ ప్రవాహ దిశకు అడ్డుగా నిలిచిన కొండ కరిగిపోయిందిలా..

ప్రజాశక్తి - జామి

ఈ చిత్రంలో కనిపిస్తున్న గోస్తనీ నదిని పరిశీలిస్తే, ఒకప్పుడు నదికి ఎదురుగా భారీ కొండ కనిపించేది. ఇదే వరదల సమయాల్లో నది ప్రవాహన్ని అడ్డుకుని, వరద నీరు జామి గ్రామంపైకి రాకుండా రక్షణ కల్పించేది. కానీ నేడు ఒకప్పటి కొండ కానరావడం లేదు. జామి గ్రామానికి ఎన్నో దశాబ్దాల చరిత్ర ఉంది. పూర్వం గోస్తనీ పరివాహక ప్రాంతంగా గ్రామం ఏర్పడింది. నదీ పరివాహక ప్రాంతం నేపథ్యంలోనే ప్రసిద్ధి శివాలయం ఏర్పాటైంది. కాలక్రమేణా గ్రామం.. నదికి సమీపంగా వెళ్లిందని పెద్దలు చెబుతున్నారు. దీంతో వరదలు వచ్చినప్పుడు, గోస్తనీ నది పొంగినప్పుడు వరదనీరు ఊరు మీదుగా ప్రవహించేదని చెబుతుంటారు.

1990 తరువాత సంభవించిన వరదల్లో కొన్ని సార్లు గ్రామం సగభాగం ముంపు బారిన పడినట్లు పెద్దలు చెబుతున్నారు. అప్పట్లో కొండలు అడ్డుగా ఉండడంతో నది ప్రవాహం దిశ మారేది. దీంతో ఊరికి కొంత ముప్పు తప్పేది. ఆనాటి రక్షణ కవచంగా ఉన్న కొండలను మైనింగ్ మాఫియా తినేసింది. నేడు కొండలు లేకపోవడంతో గోస్తనీ పొంగితే, జామి గ్రామం మీదికి వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు భయందోళన చెందుతున్న పరిస్థితి. ఇప్పటికే వరదలతో అల్లాడుతున్న అనేక పట్టణాలను చూస్తున్నాం. ఇప్పటికైనా చెరువులు, గెడ్డలు ఆక్రమించే వారిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని ఒడాలని ప్రజలు కోరుతున్నారు.

గోడను కూల్చివేసిన మహిళలు

ప్రజాశక్తి- భోగాపురం

పూర్వం నుంచి నడుస్తున్న రహదారిలో గత ప్రభుత్వ హయాంలో అడ్డంగా గోడ కట్టడంతో ఆ గోడను స్థానిక మహిళలు తొలగించారు. గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా వచ్చిన ప్రత్యేక అధికారి సుధారాణి, తహసీల్దార్ సురేష్ దృష్టికి సర్పంచ్ బుగత లలిత పలు సమస్యలు తీసుకెళ్లారు. వైసిపి ప్రభుత్వ హయంలో జరిగిన సర్పంచ్ ఉప ఎన్నికల్లో వైసిపి మద్దతు అభ్యర్థి ఓడిపోవడంతో కక్ష కట్టి ఈ గోడ నిర్మించారని ఆమె తెలిపారు. అంతేకాక ఇటీవల ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం గెలిస్తే గోడను తొలగిస్తామని ఎమ్మెల్యే లోకం మాధవి, టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు మాట ఇచ్చారని తెలిపారు. దీంతో వెంటనే స్పందించిన అధికారులు గోడను కూల్చివేయాలని ఆదేశించారు. దీంతో స్థానిక మహిళలే గుణపాలతో గోడను కూల్చివేశారు.

వరద బాధితులకు జిల్లా నుంచి కూరగాయలు

5.50 టన్నులు పంపించిన జిల్లా యంత్రాంగం

ప్రజాశక్తి-విజయనగరం కోట/ టౌన్

జిల్లా నుంచి విజయవాడ వరద బాధితులకు రెండో రోజూ వరద సహాయం పంపించే కార్యక్రమం కొనసాగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచనలతో వరద బాధితుల సహాయార్థం 5.50 టన్నుల కూరగాయలను, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు తదితర నిత్యావసరాలను మార్కెటింగ్ శాఖ గురువారం పంపించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి విజయవాడకు కూరగాయలు, నిత్యావసరాలతో వెళ్తున్న వాహనాన్ని కలెక్టర్ అంబేద్కర్ కలెక్టరేట్ వద్ద ప్రారంభించారు. దొండ, బంగాళాదుంప, కేబేజి, వంకాయలు, ఉల్లి, అరటి, పచ్చిమిరప తదితర కూరగాయలను జిల్లాలోని రైతుబజార్‌లు, హోల్‌సేల్ డీలర్ల వద్ద ఉద్యానశాఖతో కలసి సేకరించి పంపిస్తున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఎడి బి.రవికిరణ్ తెలిపారు. వీటితోపాటు 150 కేసుల వాటర్ బాటిళ్లు, 15 బాక్సుల బిస్కెట్లు పంపించామన్నారు. విజయవాడలోని వరద బాధితులకు అక్కడ ఏర్పాటు చేసిన మొబైల్ రైతుబజార్‌ల ద్వారా కూరగాయలను పంపిణీ చేస్తారని ఎడి తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ డిడి జమదగ్ని పాల్గొన్నారు.

మందులు అందజేస్తున్న మెడికల్ రిప్స్ యూనియన్ నాయకులు

మందులు అందించిన మెడికల్ రిప్స్ యూనియన్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం విజయనగరం జిల్లా మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు రూ.30వేల విలువైన మందులు సేకరించి సిపిఎం నాయకులకు గురువారం ఎల్‌బిజి భవనంలో అందజేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ వరద బాధితులకు డాక్టర్ల సలహా మేరకు మందులు అందజేస్తోందని, ఈ నేపథ్యంలో మందులు అందజేయడం అభినందనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి రమణ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మందులు సమకూర్చి వరద బాధితుల ఆరోగ్యాలను కాపాడేందుకు సహకరిస్తున్న యునియన్ నాయకులు యుఎస్ రవికుమార్‌ను అభినందంచారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీ,నివాసరావు, ఎ.జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

వరద బాధితులకు విరాళాలు సేకరణ

విజయవాడ వరద బాధితులకు సహాయార్థం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక స్టేడియంపేటలో ప్రజల నుంచి విరాళాల సేకరించారు. ప్రజలంతా ఆర్థికంగా సహకరించి విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. విరాళాలు సేకరించిన వారిలో మున్సిపల్ యూనియన్ నాయకులు జి. కుమారి, రమ, ఈశ్వరమ్మ, నాగమ్మ, అక్షయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సర్వే ఆధారంగానే జాబ్‌మేళాలు

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో వివిధ రకాల నైపుణ్యాలు కలిగిన యువత ఏ మండలంలో ఎంతమంది అందుబాటులో వున్నారనే అంశంపై సమాచారాన్ని సేకరించేందుకు జిల్లా వ్యాప్తంగా స్కిల్ సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. ఈ సర్వేలో లభ్యమైన సమాచారం ఆధారంగానే జిల్లాలో తదుపరి జాబ్ మేళాలు ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించాలని స్పష్టంచేశారు. కలెక్టర్ గురువారం తన ఛాంబరులో జాబ్ క్యాలెండర్ అమలుపై వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న జాబ్ మేళాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలపై రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ డా.ఎన్.గోవిందరావు వివరించారు. ఉద్యోగ కల్పనలో ఏతరహా నైపుణ్యాలు కలిగిన వారు ఏ ప్రాంతలో ఎంతమంది అందుబాటులో వున్నారనే సమాచారం ముఖ్యమని కలెక్టర్ ఈ సందర్భంగా చెప్పారు. ఉద్యోగులను ఎంపిక చేసుకొనేందుకు వచ్చిన ప్రైవేటు సంస్థలకు ఏతరహా నైపుణ్యాలు కలిగిన యువత అవసరమో తెలుసుకొని ఆ నైపుణ్యాలు కలిగిన యువత ఏ నియోజకవర్గంలో అందుబాటులో వుంటే అక్కడే ఆయా సంస్థలను అక్కడి జాబ్ మేళాలకు పిలవాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ హబ్‌ల ద్వారా యువత గరిష్టంగా ప్రయోజనం పొందాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, జాబ్స్ మేనేజర్ మార్టిన్, జిల్లా ఉపాధి కల్పన అధికారి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని ప్రయివేటు కళ్యాణ మండపంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ ఆధ్వర్యాన మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ విషయం తెలిసిందే. అందులో శిక్షణ పొందిన మహిళలకు విశాఖ ఎంపి శ్రీభరత్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన న్యూ లైఫ్ సంస్థకు గొంప క్రిష్ణ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గొంప క్రిష్ణ పిలుపు మేరకు వరద బాధితుల కోసం పలువురు దాతలు రూ.1.82 లక్షలను ఎంపి శ్రీభరత్‌కు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు గండి బాబ్జి, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపి శ్రీభరత్

సాగునీరు అందించేందుకు కృషి

ప్రజాశక్తి-బొబ్బిలి

రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. మండలంలోని చిత్రకోటబొడ్డవలస సమీపంలో ఉన్న వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు కాలువలను పరిశీలించారు. పంటలకు నష్టం జరగకుండా సాగునీరు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సాగునీటి కాలువలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి శివారు భూములకు సాగునీరు అందేలా చూడాలని కోరారు. కాలువలు బాగు చేసేందుకు అంచనా వేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని బేబినాయన కోరారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, ఎంపిటిసి వి.నాగరాజు, సర్పంచులు, మాజీ సర్పంచులు, నాయకులు ఉన్నారు.

విఆర్ఎస్ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ధర్నా

బొబ్బిలి : గిరిజన గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని గురువారం విద్యుత్తు డివిజనల్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ కృపావలస, దీవెనవలస, సీయోనువలస, చినఅక్కేనవలస గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఇఇ అనంతరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కోట అప్పన్న. ఆర్.సత్యం. పి.కృష్ణ.వై బాబ్జి. సిహెచ్ చిరంజీవి, సిహెచ్ బిహేన్, రాజు, జీరా పాల్గొన్నారు.

గొర్రిపాటి చిత్రపటం పట్టుకుని మాట్లాడుతున్న వైసిపి మండల కన్వీనర్ రవికుమార్

గొర్రిపాటికి అగౌరవం

ప్రజాశక్తి - జామి

గొర్రిపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి జాలాశయం పేరును మారుస్తూ టిడిపి ప్రభుత్వం జిఒ తేవడం దురదృష్టకరమని, ఇది స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటిని అగౌరపరచడమేనని వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంపై ఈ ప్రాంత వాసులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారని, తక్షణమే రాజకీయాలకు అతీతంగా అంతా ఆలోచన చేసి, జిబి అప్పారావు పేరు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గురువారం జామిలోని తన నివాసం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రిపాటి ఈ ప్రాంతానికి చేసిన సేవ మరువరానిదని, అటువంటి మహానేతకు తగిన గౌరవం ఇచ్చేందుకే వైసిపి ప్రభుత్వంలో తాటిపూడికి నామకరణం చేశారని గుర్తుచేశారు. తాటిపూడి ఆనకట్ట నిర్మాణంలోనూ ఊరూరా తిరిగి, రైతుల షేర్ ధనం కోసం జోలి పట్టి నిధులు సేకరించిన విషయాన్ని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరూ ఆలోచన చేయాలని కోరారు. అనంతరం జెడ్‌పిటిసి సభ్యులు గొర్లె సరయు, పాండ్రంగి సంజీవ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, వైస్ ఎంపిపి గేదెల వెంకట్రావు, విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, వైసిపి నాయకులు సత్యారావు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా

ప్రజాశక్తి-బొండపల్లి

ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలనే ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఇంటింటి ఓటర్ల సర్వే చేపడుతున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రమీల గాంధీ తెలిపారు. బొండపల్లిలో గురువారం ఓటర్ల గృహ సందర్శన నిర్వహించారు. ఓటరు జాబితాలో ఉన్న పేరును, గ్రామంలో నివాసముంటున్న వ్యక్తిని బేరీజు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ బిఎల్ఒ తప్పనిసరిగా ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుతోపాటు పాత ఓటర్ల చేర్పులు, మార్పుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, ఎన్నికల ఉప తహశీల్దార్ సతీష్, మండల సర్వేయర్ గౌరీశంకర్ రావు, బొండపల్లి ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

బొబ్బిలి : ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో తాగునీటి ట్యాంకులను ఎవరో అడిగితే తప్ప సిబ్బంది శుభ్రం చేయరా? అని ప్రశ్నించారు. ఆ నీరు తాగి రోగం వచ్చి చనిపోతే ఆ కుటుంబానికి ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ప్రజల నుండి ముక్కు పిండి మరీ నీటి పన్ను వసూలు చేస్తారని, కనీసం తాగునీరు కూడా ఇవ్వలేరా? అని ప్రశ్నించారు.

లేగదూడల ప్రదర్శన

మెంటాడ : స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద గురువారం లేగదూడల ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనను పశుసంవర్ధక శాఖ డిడి దామోదరరావు పరిశీలించారు. లేగదూడల సంరక్షణ, ఏవిధమైన ఫీడింగ్ పెట్టాలో రైతులకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎడి చంద్రశేఖర్, పశువైద్య అధికారి డి.వెంకటప్పల నాయుడు, ఒఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

వరద బాధితులకు మైలాన్ కార్మికుల సహాయం

పూసపాటిరేగ : విజయవాడ వరద బాధితుల కోసం పూసపాటిరేగ మండలం సిఐటియు అనుబంధ సంస్థమైన మైలాన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ తరపున రూ.10,530 సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ, మైలాన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.పుల్లయ్య, ట్రెజరర్ ఎ.గౌరి, అసిస్టెంట్ ట్రెజరర్ ఎ.త్రినాథరావు, ఉపాధ్యక్షులు గొర్లె ఆదినారాయణ, కిశోర్, లక్ష్మి మూర్తి పాల్గొన్నారు

నగరంలో అసిస్టెంట్ కమిషనర్ పర్యటన

విజయనగరం టౌన్ : నగరంలోని 7వ డివిజన్ దాసన్నపేటలో గురువారం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమల రావు పర్యటించారు. మురికి కాలువలు ఏర్పాటు చేయాలని అలాగే అక్కడక్కడ రహదారుల పాక్షిక మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరారు. పశు సంచారం ఎక్కువగా ఉండడంతో వర్షాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. అలాగే నిరుపయోగంగా పడి ఉన్న సామాజిక మరుగుదొడ్డి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. వివిధ ప్రాంతాలలో పర్యటించిన అధికారులు సమస్యలను తెలుసుకుని వాటిని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన చెప్పారు. స్థానిక కార్పొరేటర్ పొంతపల్లి మాలతి మాట్లాడుతూ తమ డివిజన్‌లో 70 శాతం మేర అభివృద్ధి పనులు చేపట్టామని, మిగిలినవి కూడా పూర్తయితే మెరుగైన సదుపాయాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ ఇబ్బందులు తొలగించిన ఎమ్మెల్యే

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ ఎదురుగా వర్షం కురిసినప్పుడల్లా నీరు నిల్వ ఉండే విశాఖ అరకు రహదారిలో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ ఉండేవారు. ఎమ్మెల్యే లలిత కుమారి చొరవతో జెసిబిలతో కాలువలు తవ్వించి నీటిని కిందకు విడుదల చేయడంతో నీరు నిల్వ డ్రైనేజీ సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో తాహశీల్దార్ అరుణకుమారి, డిటి భరత్, పిఆర్‌జెఇ సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

బొబ్బిలిరూరల్ : పోషకాహార మాసోత్సవాలు సందర్భంగా గురువారం కొత్తపెంట అంగన్వాడీ సెంటర్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని తహశీల్దార్ ఎం.శ్రీను, ఎంపిడిఒ పి.రవి కుమార్ పరిశీలించారు. అనంతరం ప్రీస్కూల్ పిల్లలకు సప్లై చేసిన ఆట వస్తువులు, పుస్తకాలు, పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. బొబ్బిలి పట్టణంలోగల ఒకటి రెండు సెక్టార్లలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ప్రీ స్కూల్ డే నిర్వహించి పిల్లల తల్లిదండ్రులను పిలిచి అంగన్వాడి కేంద్రంలో చెబుతున్న సిలబస్ ఆట వస్తువులు ప్రదర్శించారు. సెక్టార్ సూపర్‌వైజర్ బి.నిర్మల, సిహెచ్ అరుణ్ కుమారి పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజించాలి

విజయనగరంకోట : వినాయకచవితి రోజున మట్టి గణపతి ప్రతిమనే పూజించాలని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. మట్టి గణపతి విగ్రహాల ఆవశ్యకతను వివరిస్తూ జిల్లా కాలుష్య నియంత్రణ శాఖ రూపొందించిన పోస్టర్‌ను తన ఛాంబర్‌లో గురువారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మట్టి గణపతి ప్రతిమను జిల్లా కాలుష్య నియంత్రణ ఇంజనీర్ సరిత కలెక్టర్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్‌డి అనిత పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రెవెన్యూ శాఖ వితరణ

బొండపల్లి : మండలంలోని జాతీయ రహదారి 130సిడి నిర్మాణ పనుల్లో భాగంగా తొలగించి, పునర్మిర్మాణం చేపడుతున్న కొత్తపాలెం గ్రామదేవత బంగారమ్మ గుడికి బొండపల్లి రెవెన్యూ శాఖ రూ.8 వేలు విరాళం అందజేసింది. గురువారం తహశీల్దార్ డి.రాజేశ్వరరావు నగదును ఆలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. జాతీయ రహదారి 130సిడి నిర్మాణ పనుల్లో భాగంగా కొత్తపాలెం గ్రామ దేవత బంగారమ్మ గుడిని కూల్చివేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో హెచ్ డిటి హరి, ఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడం మనందరి బాధ్యత

కొత్తవలస : బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించం మనందరి బాధ్యతని మండల ప్రత్యేకాధికారి బోని రామానంద్ తెలిపారు. గురువారం కొత్తవలస మండలం నిమ్మలపాలెం గ్రామంలో జరిగిన పౌష్టికాహార అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.పద్మజ, తహశీల్దార్ పి.నీలకంఠరావు, ఐసిడిఎస్ పిఒ ఉమాదేవి, సూపర్వైజర్ రమణమ్మ, ఎంఇఒ జి.శ్రీదేవి, సర్పంచ్ కె.నిర్మలసాయి, కె.శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ఉమేష్ పాల్గొన్నారు.

వేపాడ : వల్లంపూడిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. పౌష్టికాహార ప్రాధాన్యతను అంగన్వాడీలు వివరించారు.

తెర్లాం : మండలంలోని లోచర్ల అంగన్వాడీ కేంద్రంలో గురువారం సూపర్వైజర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలను పిఒ కె.రాజ్యలక్ష్మి వివరించారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

శృంగవరపుకోట : పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో గురువారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయుర్వేద వైద్యులు జగన్మోహన్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండెక్షన్ ప్రోగ్రాం

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవ రావు మాట్లాడుతూ మొదటి సంవత్సరం విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, ద్వితీ య, తృతీయ, విద్యార్థులు అందరూ తోబుట్టువుల ఐక్యంగా ఉండాలని సూచించారు. వర్చువల్ క్లాస్, డిజిటల్ క్లాసెస్, లైబ్రరీ క్రీడామైదానం, కంప్యూటర్ ల్యాబ్, వసతులన్నీ ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె వాసుదేవరావు , కోఆర్డినేటర్ డాక్టర్ వి సుధీర్, ఎన్‌సిసి ఆఫీసర్ వలి ఖాన్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-డెంకాడ

విద్యార్థుల భవిష్యత్తును రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. గురువారం లెండి కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య ప్రాముఖ్యత గురించి చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేను యాజమాన్య ప్రతినిధులు సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి. రామారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, తమ్మినేని హరిబాబు, సెక్రటరీ, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించి గురుభక్తి చాటుకున్నారు.

తెర్లాం : సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఎంఇఒ త్రినాథరావు ఆధ్వర్యాన ఎంపిడిఒ రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు జి.మునిస్వామి, కార్యదర్శి శంకర్రావు పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సర్వేపల్లికి గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి నివాళులర్పించారు.

వేపాడ : విక్టరీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఆయన చేసిన సేవలు కొనియాడారు.

జెఎన్‌టియులో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

విజయనగరం టౌన్ : జెఎన్‌టియు జివిలో గురువారం భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్ర పటానికి జెఎన్‌టియుజివి ఇన్‌ఛార్జి వైస్ - ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడూ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్. జి.జయసుమ, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్, వైస్-ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ.. ఎమ్మెల్యే మాధవిని సన్మానిస్తున్న లెండి కళాశాల యాజమాన్య ప్రతినిధులు

దానం చేసే కొద్దీ పెరిగేది

విజయనగరం కోట : దానం చేసే కొద్ది పెరిగేది విద్య అని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో ఉపాధ్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఉపాధ్యాయులు కూర్చుండగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో వారు పాఠాలు బోధించారు. అనంతరం కరస్పాండెంట్ నారాయణరావును విద్యార్థులు సత్కరించారు.

జనసేన ఆధ్వర్యాన గురుపూజోత్సవం

విజయనగరం టౌన్ : ప్రతీ ఒక్కరి జీవితంలో గురువుల మాటే జీవితంలో ఉన్నత శిఖరాలకు బాట వేస్తుందని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను వి.టి. అగ్రహారం, 35వ డివిజన్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులకు సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ పొంతపల్లి శ్రీనివాస్, మెంబెర్ అలబోని ఈశ్వర్ రావు పాల్గొన్నారు. జనసేన నాయకులు మజ్జి శివశంకర్, కొర్నాన రామకృష్ణ , పుప్పాల అప్పలరాజు , చుక్క నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. జనసేన నాయకులు గురాన అయ్యలు ఆధ్వర్యాన తమ కార్యాలయంలో సర్వేపల్లి రాధాకష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణమూర్తి కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ వి.వి.రమణమూర్తిని ఉ సత్కరించారు. కార్యక్రమంలో పి. రవీంద్ర, పిడుగు సతీష్, సిరిపురపు దేవుడు, ఎంటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి... శ్రీచైతన్య విద్యా నికేతన్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ వేషధారణలో విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

వేపాడ.. విక్టరీ పాఠశాలలో గురుపూజోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురు టీచర్లు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు.

\- ప్రజాశక్తి, విలేకర్ల బృందం

రాజాం మండలం మొగలివలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మొయ్యి శ్రీరాములు, తెర్లాం మండలం పనుకువలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిప్పాడ రమణమూర్తి, బొబ్బిలి మండలం కింతలివానిపేట ఎంపిపి స్కూలు ఉపాధ్యాయుడు గవిరిశెట్టి వెంకటరావు, పెంట పాఠశాల హెచ్ఎం ఎ.పద్మావతికి అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ అంబేద్కర్

డుమ్మా కొడితే ఊరుకోం

మండల ప్రత్యేకాధికారి ప్రమీలా గాంధీ

మెంటాడ.. మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రమీలా గాంధీ

ప్రజాశక్తి- మెంటాడ

విధులకు డుమ్మా కొడితే ఊరుకునేది లేదని, శాఖా పరమైన చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి ప్రమీలా గాంధీ హెచ్చరించారు. గురువారం మండలంలోని కొంపంగి గ్రామంలో కూనిబిల్లి వెంకటరమణ అధ్యక్షతన గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలను, ఆరోగ్య, అంగన్వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. అనంతరం మధ్యాహ్నం భోజనం రుచి చూసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత గ్రామ సందర్శన కార్యక్రమంలో అధికారులు విధులకు డుమ్మా కొట్టిన విషయం తన పరిశీలనలో ఉందన్నారు. ఇకనుంచి ఎవరైనా విధులకు డుమ్మా కొడితే వారిపై శాఖా పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం వ్యాధుల సీజన్ కాబట్టి ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, హౌసింగ్ జెఇ డేవిడ్ ప్రసన్నకుమార్, పంచాయతీ అధికారి విమల కుమారి, కార్యదర్శి శిరీష, అంగన్వాడి సూపర్వైజర్ హైమావతి పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని రామస్వామిపేటలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ముందుగా పాఠశాలను అధికారులు సందర్శించారు. పిహెచ్‌సి వైద్యాధికారి రమాదేవి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామసభ ఏర్పాటుచేసి, గ్రామంలో అధికారులు పర్యటించారు. అంగన్వాడీని సందర్శించారు. మాజీ సర్పంచ్ గొల్ల కృష్ణ మాట్లాడుతూ క్వారీల వల్ల తమ గ్రామానికి చాలా నష్టమని తెలిపారు. తగు చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ సన్యాసినాయుడు, ఇఒపిఆర్‌డి యు.ఉమ, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి పాల్గొన్నారు.

డెంకాడ : గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారానికే గ్రామ సందర్శన చేపడుతున్నట్లు ఎంపిపి బి.వెంకట వాసుదేవరావు తెలిపారు. మండలంలోని అమకాం గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో గ్రామాల్లో అధికారులతో కలిసి పర్యటించి, సమస్యలను తెలుసుకున్నారు. సచివాలయ ఆవరణలో, పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జమదగ్ని, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, తహశీల్దార్ పద్మావతి, సర్పంచ్ బలస అప్పారావు, నాయకులు కోటి, పెంటరాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం జీవకోటికి ప్రాణాధారం

రేగిడి : మొక్కలు నాటడంతో జీవకోటికి ప్రాణధారమని రాజాం రూరల్ సిఐ ఉపేంద్రరావు అన్నారు. కొండవలస గ్రామంలో గురువారం డిపో యూత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వైకుంఠ రావు, ఎపిఒ హరినాథ్, కార్యదర్శి తులసి, భాస్కరరావు పాల్గొన్నారు.

చీపురుపల్లి ఎస్ఐగా దామోదరరావు

చీపురుపల్లి : చీపురుపల్లి ఎస్ఐగా ఎల్.దామోదరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గరివిడి ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై చీపురుపల్లి వచ్చారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం

బొబ్బిలి : విద్యాభివృద్ధికి పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గురువారం సన్మానించారు. విద్యారంగ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు రౌతు రామమూర్తి కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, సభ్యులు ఎల్.జగన్నాథం, పి.సత్యంనాయుడు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తుపాను పట్ల అప్రమత్తం

రేగిడి : తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ డి.ఎల్లారావు సూచించారు. మండలంలోని నాగావళి నదీతీర ప్రాంతాలైన ఖండ్యాం, కొమెర, వెంకటాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. కార్యక్రమంలో సిబ్బంది పట్టాభి, రాజు, గోవిందరావు ఉన్నారు.

ఆర్థిక సాయం

వేపాడ : వేపాడ గ్రామానికి చెందిన కొలుపూరి రమణ కొన్ని రోజులుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. మన వేపాడ- మన నేస్తం స్వచ్ఛంద సంస్థ సభ్యులు రూ.5 వేలు నగదును గురువారం ఆయనకు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

వంగర : మండలంలోని ఓని అగ్రహారం వద్ద నాగావళి నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది రామకృష్ణ, కూర్మినాయుడు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం

బొండపల్లి : మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టారీత్యా నేరమని బొండపల్లి ఎస్ఐ యు.మహేష్ అన్నారు. గురువారం స్థానిక జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహన ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించక పోవడం, అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనాలను నడపడంతో అనేక ప్రమాదాలకు బాధ్యులవుతున్నారని ఎస్ఐ తెలిపారు.

గురజాడ కళాభారతి ఆడిటోరియం పరిసరాల్లో డివైఎఫ్ఐ శ్రమదానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గురజాడ కళాభారతి ఆడిటోరియం పరిసర ప్రాంతాల్లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి ప్రారంభిస్తూ యువత చదువు, ఉపాధి తో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయం అన్నారు. పోటీ పరీక్షలకు నిరంతరం నగారానికి వచ్చి చదువుకునే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, ప్రస్తుతం గురజాడ కళాభారతి ఆడిటోరియం ఆవరణలో ఉన్న సౌకర్యాలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని అన్నారు. డివైఎఫ్ఐ ప్రతినిధులు సమస్యల్ని అధ్యయనం చేసి వినతిపత్రం ఇవ్వడంతో పాటు , స్వచ్ఛందంగా శ్రమదానం చేసి పరిసర ప్రాంతాల్లో చెత్తను, పిచ్చి మొక్కలను, తుప్పలను తొలగించారని తెలిపారు. బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్ల నిర్వహణ, మంచినీరు సరఫరా తదితర సమస్యల్ని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.హెచ్ హరీష్, సోమేశు, తవిటయ్య , శంకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలం, ప్రకాశరావు, తదితరులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఘనంగా మదర్ థెరిస్సా సేవా సంఘం వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మదర్ థెరిస్సా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ 7వ వార్షికోత్సవం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా అయ్యన్నపేట జంక్షన్ లో ఉన్న మదర్ తెరిసా కిడ్స్ స్కూల్ లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ ఎఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ మదర్ థెరిస్సా సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సేవా సంఘం గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, డాక్టర్ ఎఎస్ ప్రకాశ రావులను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించారు.

ఆంగ్ల అధ్యాపకులు శోభన్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-భోగాపురం

రావాడలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడు గండి శోభన్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆచార్య ఎస్. ప్రసన్న పర్యవేక్షణలో భారతీయ ఆంగ్ల సాహిత్యంలోని శోభన్ బంత్వాల్ అనే రచయితపై పరిశోధన చేసినందుకు ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పి.వి.జి.డి. ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా శోభన్ డాక్టరేట్ అందుకున్నారు. అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకులు, అధ్యక్షులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ సందర్భంగా ఆయనను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి. గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.భాస్కర రావు, అధ్యాపకులు డాక్టర్ శోభన్‌ను ప్రశంసించారు.

వికలాంగులకు సేవ చేయడం గొప్ప విషయం


కృత్రిమ అవయవాల పంపిణీలో పాల్గొన్న ఎమ్‌పి శ్రీభరత్

కొత్తవలస : నేటి సమాజంలో వికలాంగులకు అన్ని రకాల సేవలు అందించడం గొప్ప విషయమని విశాఖ ఎమ్‌పి ఎం.శ్రీభరత్ అన్నారు. గురువారం కొత్తవలస మండలం మంగళపాలెం గ్రామంలోని శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాపర్తి జగదీష్ బాబు ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని, గురుదేవ హాస్పిటల్‌ను ఆయన సందర్శించారు. 70 మంది అంధులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పి.గోవింద సత్యనారాయణ, సిఐఎస్ఎఫ్ డిఐజి అనిల్ పాండే, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు గండి బాబ్జి, ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ వి.ఫణింద్ర పాల్గొన్నారు.

చోరీపై దర్యాప్తు

బొబ్బిలి : ఎన్‌సిఎస్ చక్కెర కర్మాగారానికి అనుబంధంగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ కాపర్, ఆయిల్ చోరీపై పోలీసులు దర్యాప్తు చేశారు. ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఎన్‌సిఎల్‌టి కోర్టులో ఉండడంతో యాజమాన్యంతో ఎన్‌సిఎల్‌టి నియమించిన ఉద్యోగులు కుమ్మక్కై విలువైన సామగ్రి చోరీ చేసి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కార్మిక సంఘాల నేతల పర్యవేక్షణతో చోరీ బయట పడడంతో ఎన్.సి.ఎల్.టి కోర్టు ప్రతినిధులు ఆన్‌లైన్‌లో పార్వతీపురం జిల్లా ఎస్‌పికి ఫిర్యాదుచేశారు. దీంతో చక్కెర పరిశ్రమకు పోలీసులు చేరుకుని దర్యాప్తు చేశారు. విలువైన సామగ్రి చోరీకి గురైనట్లు పోలీసులు గుర్తించారు.

క్విజ్ పోటీలలో వంగపల్లిపేట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చీపురుపల్లి

బహుమతులు అందజేస్తున్న ప్రకాశ్

స్థానిక గీతా మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత క్విజ్ పోటీలలో వంగపల్లి పేట పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కృష్ణాష్టమి సందర్భంగా గీతామందిరంలో గీతాశ్లోకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వంగపల్లిపేట పాఠశాల విద్యార్థులు ముల్లు చేతన ద్వితీయ స్థానం, గొర్లె చందు తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విజేతలకు గీతామందిరం నిర్వాహకులు ప్రకాష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సౌదామణి, ఉపాధ్యాయులు ఎన్. బలరాం, వి.రవీందర్ నాయుడు, జి.జానకి రామ్ పాల్గొన్నారు.

ఘనంగా జెడ్‌పి చైర్మన్ జన్మదిన వేడుకలు

విజయనగరం టౌన్ : జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలను గురువారం జెడ్‌పిలోని తన ఛాంబర్ వద్ద ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. చిన్న శ్రీను సోల్జర్స్, జిల్లా పరిషత్ సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కెవి సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, గంట్యాడ జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, వైసిపి నాయకులు కనకల రఘురాం, ఒమ్మి శ్రీను, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, మన్మధకుమార్, పిఎ కొండలరావు, సిసి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం : మండలంలోని సోమలింగాపురం సాయిబాబా ఆలయంలో జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు పుట్టిన వేడుకలను వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్ కుమార్, తల చుట్ల హరి బాబు, సీతారామరాజు, తిరుమల రాజు వర్మ రాజు, జి.మర్రివలస సర్పంచ్ దేవ పాల్గొన్నారు.

చీపురుపల్లిలో జెడ్‌పి చైర్మన్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న నాయకులు

చీపురుపల్లి : స్థానిక వైసిపి కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు పండ్లు, రొట్టెలను పంచిపెట్టారు. వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఎం.వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరంకోట

డెంకాడ మండలం చింతలవలసలో గల ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు ఎదురుగా ఉన్న నీలగిరి తోటలో గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి 2 కిలోల గంజాయిని డెంకాడ పోలీసులు స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండుకు తరలించినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన వ్యక్తితో కలసి ఎంవిజిఆర్ కళాశాలకు దగ్గరలో గల నీలగిరి తోటలో గంజాయి విక్రయిస్తున్నట్లుగా బుధవారం డెంకాడ పోలీసులకు సమాచారం వచ్చిందని తెలిపారు. ఎస్ఐ సన్యాసి నాయుడు మరియు ఇతర పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి రైడ్ చేసి, గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని, గంజాయి సేవిస్తున్న మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి, ఒక స్కూటీ, రూ. 400 నగదును పోలీసులు స్వాధీనం చేసుకొని, విచారణ చేపట్టారన్నారు. నిందితులు అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం వంచనారంగిని గ్రామం, బూర్జ పంచాయితీకి చెందిన సామర్థి నాగేశ్వరరావు (23), శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలానికి చెందిన గణేశ్వరం సంజయ కుమార్ (18), డెంకాడ మండలం రఘుమండ గ్రామానికి చెందిన దుర్గాసి కనకరాజు (24), బత్తుల కిరణ్ (24), రణస్థలం మండలం బంటువల్లి గ్రామానికి చెందిన టొంపల నాగభూషణం (18), రణస్థలం మండలానికి చెందిన రాజమహంతి అనిల్ కుమార్ (23), చింతలవలసకు చెందిన చీకటి నందీప్ (22) గంజాయి సేవించడానికి, విక్రయించడానికి అలవాటు పడ్డారన్నారు. గంజాయి అక్రమ రవాణకు పాల్పడినా, విక్రయించినా, గంజాయి సేవించినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి హెచ్చరించారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఫస్ట్‌ఫ్లోర్, పి.వి.ఎస్. ప్రైమ్, ఎ.జి. రోడ్, 3 లాంతర్ సెంటర్, విజయనగరం.ఫోన్ :80746 56196

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-09-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 161.56 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop ,DwarakaNagar, Visakhapatnam, నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop, DwarakaNagar, Visakhapatnam, PIN – 530018, CONTACT PERSON AREA MANAGER-NAGESH, CELL NO 89192-39576

మహారాజశ్రీ శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS. 58/2024

Between:
Bonthala Thaviti Naidu ....వాది
And:
Jami Appala Raju ....ప్రతివాది
TO:
Jami Appala Raju S/o late Appala Suri, R/o Jami village, Jami mandal, Vizianagaram District.

వాయిదా తే:19-09-2024 ది

దావా పరిహారం నిమిత్తం మీ మీద పైన వివరించిన వ్యాజ్యము వాది తెప్పించినందువల్ల దావాకు ప్రత్యుత్తరము చెప్పుటకు **2024 వ సం॥ September, నెల 19 తారీకున పగలు 10-30 గంటల**కు స్వతహాగా లేక సరి అయిన భోగట్టా ఇవ్వబడిన వకీలు గారి ద్వారా గాని లేక సరి అయిన ఏజెంటు మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు యిందువల్ల మీకు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతిపాదమునకు ఆధారముగా ఉద్దేశించి యుండే దస్తావేజులన్నింటినీ నీ యొక్క స్టేట్ మెంటుతో సహా ఆ రోజు హాజరు పరచుటకు మీకు ఉత్తరువు చేయడమైనది.

పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిన ఎడల మీ పరోక్షమందు పై వ్యాజ్యమును విమర్శన చేసి తీర్మానించడ మగునని మీకు తెలియుజేయడమైనది .

Srungavarapukota,
Date: 5-09-2024.

B.TRIMURTULU
Advocate for the Plaintiff
Srungavarapukota
Vizianagaram District
Cell : 9959202348